ప్రజల చెంతకే సేవలు !

- అందరి మన్ననలు పొందుతున్న వలంటీర్ వ్యవస్థ
- కుటుంబ సభ్యుడిలా మెలుగుతున్న వలంటీర్
- ప్రజాసేవకుడిలా అండగా నిలుస్తున్న వైనం


సంజామల మండలం, నొస్సం గ్రామంలో కరోనా సమయంలో ట్రాక్టర్ సాయంతో మలాతీయన్ ద్రవం స్ప్రే చేస్తున్న వలంటీర్లు ఉస్సేన్‌వలి, నడిపి ఉస్సేనయ్య (ఫైల్)

సంజామల: ప్రజల వద్దకే పాలన లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన వలంటీర్, సచివాలయ వ్యవస్థలు అందరి మన్ననలు పొందుతున్నాయి. ప్రత్యేకించి వలంటీర్లు తమకు కేటాయించిన యాభై కుటుంబాలకు ఓ సభ్యుడిగా మెలుగుతూ అన్నివిధాలుగా ప్రజలకు అండగా నిలుస్తున్నారు. ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ సేవలు వివరిస్తూ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ చైతన్య పరుస్తున్నారు. అర్హత మేరకు ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయడంలో కీలకపాత్ర పోషిస్తున్న వలంటీర్లు వారి కుటుంబ సభ్యుడిలా మారిపోతున్నారు. పింఛన్, రేషన్‌కార్డు, అమ్మఒడి, విద్య, వసతి దీవెన తదితర సంక్షేమ పథకాలకు వలంటీర్ అర్హుల దగ్గర ఉండి దరఖాస్తు చేయిస్తున్నారు. నియోజకవర్గ కేంద్రం బనగానపల్లెతోపాటు కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల మండలాలలో 1609 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా సేవలు అందజేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వీరికి గౌరవవేతనంగా కేవలం రూ.5వేలు మాత్రమే. ప్రజాసేవపై ఆసక్తి ఉన్న యువతీయువకులు వలంటీర్ల బాధ్యతను అంకితభావంతో నిర్వర్తిస్తూ ప్రజలకు సంక్షేమ పథకాలు చేరవేయడంతో ముఖ్యభూమిక పోషిస్తున్నారు. ప్రత్యేకించి ఒకటవ తేదీ తెల్లారకముందే లబ్ధిదారుల ఇళ్లకు తలుపుతట్టి ఠంఛన్‌గా పింఛన్ అందజేస్తున్న తీరుపై అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో పింఛన్ తీసుకునేందుకు పడరాని పాట్లు పడిన లబ్ధిదారులైన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు వలంటీర్లను మనస్ఫూర్తిగా దీవిస్తున్నారు కూడా.

పింఛన్ మంజూరు కావాలంటే... ఒకరు చావాల్సిందే!

గత ప్రభుత్వం అర్హత ఉండికూడా పింఛన్ మంజూరువ్వాలంటే నానాపాట్లు పడాల్సిన పరిస్థితి. జన్మభూమి కమిటీ, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి దుస్థితి. అయినా మంజూరు అవుతుందనే గ్యారంటీ లేదు. తెలుగుతమ్ముళ్లు, జన్మభూమి కమిటీ సభ్యుల దయాదాక్షిణ్యాలు తప్పనసరి... అసరమైతే చేతులూ తడపాల్సిన పరిస్థితి. అదికూడా ఆ గ్రామం లేదా వార్డులో ఒక పింఛన్‌దారుడు మృతి చెందితే మరొకరికి పింఛన్ మంజూరు అయ్యే దౌర్భాగ్య పరిస్థితులు. వలంటీర్ వ్యవస్థతో వాటిన్నంటికీ చరమగీతం పాడింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. ఏడాదికి రెండుమార్లు సామాజిక పింఛన్‌కు దరఖాస్తు చేసుకునే విధంగా వెసులుబాటు కల్పించింది. ప్రత్యేకించి వలంటీర్ అర్హతలన్నింటినీ పరిశీలించి స్వయంగా దరఖాస్తు చేయిస్తుండడంతో అర్హులందరికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పింఛన్ అందుతుందనేది అక్షర సత్యం.

కరోనా సమయంలో వెలకట్టలేని వలంటీర్ల సేవలు...

ప్రత్యేకించి కరోనా సమయంలో వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని నేటికీ గుర్తు చేస్తున్నారు ప్రజలు. ఇంటి నుంచి బయటకు రాలేని దుర్భర పరిస్థితులు... కరోనా మహమ్మారి సోకిన బాధితుల భయాందోళనలు వర్ణనాతీతం. అయితే స్వచ్ఛంద సేవకులైన వలంటీర్లు ప్రజలకు అన్నివిధాలా అండగా నిలిచారు. ప్రభుత్వం అందజేసిన సాయంతో పాటు పింఛన్, దాతల నుంచి సేకరించిన నిత్యావసర సరుకులను ఇంటింటి తలుపుతట్టి మరీ అందజేశారు. భయపాడాల్సిన అవసరం లేదని.. భౌతిక దూరం పాటిస్తే చాలంటూ ప్రజలు చైతన్య పరిచారు వలంటీర్లు. ఏ మాత్రం అనుమానం ఉన్నా కరోనా పరీక్షలు చేయించడంతోపాటు మందులు అందజేసి పాటించాల్సి జాగ్రత్తలు వివరించి మనోధైర్యాన్ని కల్పిస్తూ అండగా నిలిచారు. పారిశుద్ధ్యంలోపించిన ప్రాంతాల్లో అక్కడక్కడ వలంటీర్లు కార్మికుల్లా బ్లీచింగ్ పౌడర్ చల్లి.. మలాతీయన్ స్ప్రే చేసి అందరిమన్ననలు పొందారు.

ధ్రువీకరణ పత్రాలు అందజేయడంలోనూ...

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసినప్పటికీ సాంకేతిక సమస్యల మూలంగా ప్రభుత్వ ఫలాలు అందని పేదలను గుర్తించి న్యాయం చేయడంతో పాటు ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను స్వగ్రామంలోనే నేరుగా అందజేసేందుకు వైఎస్సార్‌సీపీ సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు జరిగిన మేలులోనూ కీలక పాత్ర వలంటీర్లదే. జూలై 1 నుంచి నెలపాటు సాగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో సచివాలయ సిబ్బందితో కలిసి ఆయా కుటుంబాలకు సర్టిఫికెట్ల అవసరాన్ని గుర్తించి దరఖాస్తు చేయించారు వలంటీర్లు. పైసా ఖర్చు లేకుండా కుల, ఆదాయ, బర్త్ తదితర సర్టిఫికెట్లు ఉచితంగా అందజేయడంతో ప్రజల నుంచి హర్షాతిరేకాలు వెల్లువెత్తాయి. ఇంత వరకు ఎలాంటి సర్టిఫికెట్ పొందని నిరక్షరాస్యులు సైతం ధ్రువీకరణ పత్రాలు పొందారు కూడా.


ఈ కేవైసీ చేస్తున్న వలంటీర్ (ఫైల్)

నియోజకవర్గంలోని మండలాలు.	వలంటీర్ల సంఖ్య
బనగానపల్లె	590
కొవెలకుంట్ల	277
కొలిమిగుండ్ల	280
అవుకు	270
సంజామల	192
నియోజకవర్గంలోని వాలంటీర్లు	1,609

కుటుంబ సభ్యునిలా సేవలు



వలంటీర్లు అంకిత భావంతో సేవలు అందిస్తున్నారు. ప్రత్యేకించి కరోనా సమయంలో కుటుంబ సభ్యుడిగా మేలుగుతూ సాయపడ్డారు. నా విషయంలో వలంటీర్ హుస్సేన్ వలి చేసిన సేవ ఎప్పటికీ మరువలేనిది. ఆరోగ్య సూత్రాలు వివరించాడు. ప్రతి నెలా పింఛన్ ఇంటి వద్దకు వచ్చి నగదు అందజేశాడు. అదేవిధంగా ప్రభుత్వ సాయంతోపాటు నిత్యావసర సరుకులు అందజేసి అండగా నిలిచాడు. – అబ్దుల్ షుకూర్, నొస్సం.

వలంటీర్ల సేవలు బాగున్నాయి



వలంటీర్ల సేవలు బాగున్నాయి. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకాన్ని ఇంటి వద్దకే వచ్చి అందిస్తున్నారు. అనారోగ్యంతో హైదరబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాకు అక్కడికి వచ్చి పింఛన్ సొమ్ము అందించారు. గతంలో ప్రభుత్వ పథకాల గురించి తెలిసేది కాదు. ఇప్పుడు వలంటీర్ల ద్వారా అన్నివిషయాలు తెలుస్తున్నాయి.

– కోడూరు నారయణ, రామిరెడ్డిపల్లె

క్లుప్తంగా

నాగలింగేశ్వర స్వామి ఆలయాభివృద్ధికి కృషి


ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్

బేతంచెర్ల: మండల పరిధిలోని బుగ్గానిపల్లెలో వెలసిన బ్రహ్మసూత్ర సహిత నాగలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు. పూరాతన ఆలయ అభివృద్ధికి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో రూ. 40 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు ఆలయ నిర్మాణం చేపట్టే విషయాలపై ఆలయ కమిటీ సభ్యులు చిన్ని శేషఫణి, ఎల్ల రామయ్య, నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగవెంకటేశ్వర్లుతో వారు చర్చించారు. ఆలయ పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వారిని శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు సుబ్బన్న, బాలస్వామి, కేశాలు, రాముడు పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతి నెలకొనాలని ప్రార్థనలు


ప్రార్థనలు చేస్తున్న ఫాస్టర్లు

డోన్: మణిపూర్ రాష్ట్రంలో శాంతి నెలకొనాలని డోన్ డివిజన్ ఫాస్టర్ ఫెలోసిప్ ఆధ్వర్యంలో పాస్టర్లు మంగళవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక గుత్తిరోడ్డులోని క్రిస్టియన్ కమిటీ హాల్‌లో జరిగిన దైవసేవకు నిత్యాన్నదానం ఆధ్వర్యంలో రాష్ట్రంలో శాంతి నెలకొనాలని, అమరుల ఆత్మ శాంతించాలని కోరుతూ 75 మంది ఫాస్టర్లు ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో డోన్ డివిజన్ ఫాస్టర్ ఫెలోసిప్ నాయకులు ఫాస్టర్ శ్యాంసన్, బైబిల్ మిషన్ మోహన్‌రావ్, ఫాస్టర్ ప్రవీన్, డోన్ డివిజన్ క్రిష్టియన్ జేఏసీ నాయకులు ఆదాం, ఇర్మియా, జాన్సన్‌బాబు, ప్రవీన్ పాల్గొన్నారు.

దిక్సూచి విద్యార్థులకు వరం


విద్యార్థులకు దిక్సూచిని అందించిన దృశ్యం

డోన్ టౌన్ : పదవ తరగతి చదివే విద్యార్థులకు దిక్సూచి వరం అలాంటిదని హెచ్‌ఎం వెంకట సుబ్బారెడ్డి అన్నారు. పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు దిక్సూచి పుస్తకాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దిక్సూచి పుస్తకంలో ఫిజికల్ సైన్స్ చాల సులభంగా అర్థమయ్యే రీతిలో 160 పేజీలతో ముద్రించారన్నారు. తక్కువ వ్యవధిలో నేర్చుకునేందుకు వీలుగా అన్ని రకాల ప్రశ్నలకు సమాధానాలు రాయడానికి అనుగుణంగా ఫిజికల్ సైన్స్ ఫోరం తయారు చేసారన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు వెంకటరమణ, సుబ్బరాయుడు, భూకాంతరెడ్డి, శ్రీనివాసులు, బాబు తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యలో సంస్కరణలు చేపట్టాలి

డోన్‌టౌన్ : వైద్య విద్య ప్రవేశాల్లో తీసుకొచ్చిన 107,108 జీవోలను ఉప సంహరించుకొని సంస్కరణలు చేపట్టాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పవన్ కోరారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రవేశ పెట్టిన ఆ జీవోల మూలంగా పేద, మధ్య తరగతి విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు.

కండ్లకలక సోకకుండా జాగ్రత్తలు పాటించాలి


అంగన్‌వాడీ టీచర్‌కు ఆయుష్ మాత్రలు అందజేస్తున్న దృశ్యం

ప్యాపిలి: కండ్లకలక వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని ఆయుర్వేద వైద్యుడు రాజారావు సూచించారు. మంగళవారం ఆయన అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిశుభ్రంగా ఉన్న వస్తువులను తాకిన చేతితో కళ్లను తాకరాదన్నారు. చేతులను తరచూ శుభ్రం చేసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు, ప్రధానోపాధ్యాయులకు కండ్లకలక, ఇతర సీజనల్ వ్యాధుల నివారణకు ఆయుష్ మాత్రలను అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ రాఘవేంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాకు నాయకులు సహకరించాలి

- ఆర్డీఓ వెంకటరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటరెడ్డి

డోన్ : ఇంటింటా ఓటర్ల పరిశీలనతోపాటు మార్పులు, చేర్పులు చేసేందుకు రెవెన్యూ అధికారులు, బీఎల్‌ఓలు చేపట్టిన సర్వే సాఫీగా సాగుతోందని ఆర్డీఓ వెంకటరెడ్డి తెలిపారు. స్థానిక ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో ఇంటింటా ఓటర్ల సర్వే పురోగతిపై మంగళవారం ఆర్డీఓ నిర్వహించిన సమావేశానికి డోన్, ప్యాపిలి, బేతంచెర్ల తహసీల్దార్లు విద్యాసాగర్, చంద్రశేఖర్‌వర్మ, నరేంద్రనాథ్‌రెడ్డి, బీఎల్‌ఓలు హాజరయ్యారు. ఓటర్ల జాబితాకు తుదిరూపును ఇచ్చేందుకు చేపట్టిన సర్వేకు అన్ని పార్టీల నాయకులు మరింత సహకారం అందజేయాలని ఈ సందర్భంగా ఆర్డీఓ కోరారు. మరో ఏడాదిలోపు ఎన్నికలు రానున్నందున, ఓటర్ల జాబితా పారదర్శకంగా రూపొందించేందుకు ప్రజా ప్రతినిధులు సహకరించాలన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలి

కొలిమిగుండ్ల: గ్రామాల్లో ఇంటింటి సర్వే జరుగుతుందని, తప్పులు లేని ఓటర్ల జాబితా తయారు చేసేందుకు రాజకీయ పార్టీల సహకరించాలని తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్ అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితాపై నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడారు. ప్రతి బూత్‌కు ఒకరు చొప్పున ఏజెంట్లను నియమించుకోవాలని నాయకులకు సూచించారు. 50 మంది బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేస్తున్నారన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలన్నారు. వందేళ్ల వయసు ఉన్న ఓటర్లను గుర్తిస్తున్నామన్నారు. మండలంలో 41,882 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఇప్పటి వరకు16,059 మంది ఓటర్ల సర్వే జరిగిందన్నారు. చాలా గ్రామాల్లో ఒక కుటుంబంలోని సభ్యులు ఓట్లు ఒకే పోలింగ్ స్టేషన్‌లో కాకుండా వేర్వేరు స్టేషన్లలో ఉండడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, ఒకే బూత్‌లో ఉండేలా చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు లాయర్ మహేశ్వరరెడ్డి తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. సూపర్‌వైజర్ భాస్కర్‌రెడ్డి,వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి తదితరలు పాల్గొన్నారు.

సంజామల: ఓటర్ల జాబితా పారదర్శకంగా రూపొందించేందుకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకారం అందించాలని తహసీల్దార్ మల్లికార్జున రావు సూచించారు. మంగళవారం తన కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడారు. ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలని ఈ సందర్భంగా ఆయన బీఎల్‌ఓలకు సూచించారు.

నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం


రామక్రిష్ణాపురం గ్రామంలో నామినేషన్ స్వీకరిస్తున్న ఎన్నికల అధికారి నాగరాజు

బనగానపల్లె : మండలంలోని అప్పలాపురం 10వ వార్డు, రామక్రిష్ణాపురం రెండవ వార్డుకు మంగళవారం ఒక్కో నామినేషన్ దాఖలు చేశారు. అప్పలాపురంలో గాలిసుబ్బలచ్చమ్మ, రామక్రిష్ణాపురంలో బి శేఖర్ తమ నామినేషన్లను ఎన్నికల అధికారులు స్వరూప, నాగరాజుకు అందజేశారు. ఈ నెల 10వ తేది వరకు నామినేషన్ల దఖాలుకు సమయం ఉంది. ఎంపీడీఓ శివరామయ్య నామినేషన్ కేంద్రాలను పరిశీలించారు. నామినేషన్ కేంద్రాల వద్ద నంది వర్గం ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మంజునాథ్, ఖలీల్, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వార్డుమెంబర్ స్థానానికి ఒక నామినేషన్


కోవెలకుంట్ల: మండలంలోని సౌదరదిన్నె గ్రామ పంచాయతీలో ఖాళీగా ఉన్న వార్డుమెంబర్ స్థానానికి మంగళవారం ఒక నామినేషన్ అందినట్లు ఎంపీడీఓ రాధిక తెలిపారు. కోవెలకుంట్ల, చిన్నకొప్పెర్ల, కలుగొట్ల, సౌదరదిన్నె గ్రామాల్లో ఒక్కో వార్డుమెంబర్ స్థానాలకు ఉప ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. ఆయా గ్రామాలకు ఉప ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరీష్, ఎంఈఓలు వెంకటరామిరెడ్డి, వెంకటసుబ్బయ్య, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ నరేంద్రనాథ శర్మలను నియమించినట్లు పేర్కొన్నారు.

మొదటి రోజు నామినేషన్‌లు నిల్

కొలిమిగుండ్ల: పంచాయితీల్లో వివిధ కారణాలతో ఖాళీలు ఏర్పడిన సర్పంచ్, వార్డు స్థానాలకు నిర్వహిస్తున్న ఉప ఎన్నికల్లో భాగంగా మొదటి రోజు మంగళవారం నామినేషన్‌లు ఎక్కడా వేయలేదని ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. కనకాద్రిపల్లె పంచాయితీ సర్పంచ్ స్థానంతో పాటు బెలుం నాల్గవ వార్డు, అంకిరెడ్డిపల్లె ఒకటవ వార్డు స్థానాలకు మండలంలో ఉప ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. 10 వ తేది సాయంత్రం తో నామినేషన్ల పర్వం ముగుస్తుందన్నారు.

రైలు ప్రమాదంలో గాయపడిన గుర్రానికి చికిత్స

- ప్రాణాలు కాపాడిన వైఎస్సార్ సంచార వాహనం


గుర్రానికి చికిత్స నిర్వహిస్తున్న పశువైద్యులు

డోన్ టౌన్ /ప్యాపిలి: రైలు ప్రమాదంలో గాయపడిన గుర్రానికి డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ వాహనం ప్రాణం పోసింది. వివారలు ఇలా ఉన్నాయి. డోన్ పట్టణంలో మంగళవారం రాత్రి రైలు ప్రమాదంలో ఓ గుర్రం తీవ్రంగా గాయపడింది. మంగళవారం ఉదయం గుర్తించిన ప్రజలు పట్టాలపై నుంచి అతికష్టం మీద ప్లాట్‌ఫాంపైకి తీసుకొచ్చారు. సమాచారం మేరకు స్పందిచిన స్ఫూర్తి సేవా సమితి వ్యవస్థాపకుడు మధు స్టేషన్‌కు చేరుకుని గుర్రానికి ఆహారం అందజేసి నీరుతాపాడు. అయితే డోన్‌లో పశువైద్యులు అందుబాటులో లేక పోవడంతో డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ వాహనంలో గుర్రాన్ని ప్యాపిలి పశువైద్యశాలకు తరలించారు. స్థానిక యువకులు సునీల్, చంద్ర పశువైద్యులు ఏయూ హరీష్‌కు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు హరీష్ తన సిబ్బందితో కలసి గుర్రానికి చికిత్స అందించారు. కాలుకు పెద్దగాయం కావడతో తొలగించి చికిత్స చేశారు. అనంతరం గుత్తి పట్టణ సమీపంలోని గోశాలకు గుర్రాన్ని తరలించారు.

నేడు డోన్‌కు రానున్న వందే భారత్ ట్రైన్

డోన్ టౌన్ : ఇటీవల ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించిన వందే భారత్ ట్రైన్ బుధవారం డోన్‌కు రానున్నట్లు డోన్ రైల్వే స్టేషన్ మాస్టర్ వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో పెర్కొన్నారు. కాచిగూడ నుంచి డోన్ వరకు ట్రయల్ రన్‌లో భాగంగా డోన్‌కు వస్తుందన్నారు. కాచిగూడలో ఉదయం 10గంటలకు బయలుదేరి డోన్‌కు మధ్యాహ్నం 2గంటలకు చేరుకుంటుందన్నారు.

మధ్యాహ్నం 3గంటలకు తిరిగి డోన్‌లో బయలుదేరి కాచిగూడకు సాయంత్రం 7గంటలకు చేరుకోనున్నట్లు ఆయన తెలిపారు.

10న పత్ర కులస్తుల సమావేశం

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలోని షిర్డీసాయి పంక్షన్ హాల్‌లో ఈనెల 10న పత్ర కులస్తుల జిల్లాస్థాయి ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. పత్రలను బీసీలో చేర్చిన తర్వాత ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2021లో నంద్యాలలో మాత్రమే సమావేశం జరిగిందన్నారు. జిల్లా విభజన తర్వాత నంద్యాల జిల్లాలో ఎక్కడా సమావేశం నిర్వహించలేదని, కొలిమిగుండ్లలో ఏర్పాటు చేస్తున్న జిల్లా స్థాయి సమావేశంలో సంఘాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పత్ర కులస్తులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

బేతంచెర్ల: పట్టణంలోని సుబ్బారెడ్డి నగర్‌లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని సుబ్బారెడ్డి నగర్‌లో తాగునీటి సమస్య తలెత్తడంతో కమిషనర్ రమేష్ బాబు, చైర్మన్ చలం రెడ్డి కాలనీని సందర్శించారు. ప్రస్తుతం కాలనీకి సరఫరా అయ్యే బోరు బావులో భూగర్భ జాలాలు ఇంకిపోయాయని, మరో బోరు బావిలో మోటర్ ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తామని వారు చైర్మన్ తెలిపారు.

సన్మానం

ప్యాపిలి: మండల పరిధిలోని చిన్నపొదిళ్ల ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వహించిన సజీవరాజు పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఈ మేరకు స్థానిక పాఠశాలలో మంగళవారం సన్మానం చేశారు. ఉపాధ్యాయుల సేవలను ఈ సందర్భంగా సర్పంచ్ వరలక్ష్మి గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి, పాఠశాల చైర్మన్ నాగరాజు, ఉపాధ్యాయులు మోహన్, శివ తదితరులు పాల్గొన్నారు.

కొత్త జిల్లాలో దివ్యాంగుల శాఖ ఏర్పాటు చేయాలి

బనగానపల్లెరూరల్ : కొత్తగా ఏర్పాడిన జిల్లాల్లో దివ్యాంగుల శాఖలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జాతీయ దివ్యాంగుల హక్కుల వేదిక అధ్యక్షుడు వంకదారి రవికుమార్ కోరారు. ఈ మేరకు మంగళ వారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ రాఘవేంద్ర ప్రసాద్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా దివ్యాంగుల సంఘం సీనియర్ నాయకులు రంగన్న, ఏపీ దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శీలం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును ఆక్రమిస్తే సహించం

డోన్ : పట్టణ సుందరీకరణలో భాగంగా పాతబస్టాండ్ నుండి రైల్వేస్టేషన్ వరకు ఇటీవల నిర్మించిన నాలుగులైన్ల రోడ్లపై ఎక్కడపడితే అక్కడ ఆక్రమణలు చేస్తే సహించేది లేదని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ఉదయం పాతబస్టాండ్, రైల్వే స్టేషన్ రోడ్డుపై నిలిపిన తోపుడుబండ్లను మున్సిపల్ సిబ్బంది ట్రాక్టర్ల ద్వారా కార్యాలయ ఆవరణకు తరలించారు. ఒక వైపు రోడ్డు ఫుట్‌పాత్ పనులతో పాటు డ్రైనేజీ నిర్మాణం పనులు జరుగుతుంటే నడిరోడ్డుపై తోపుడుబండ్లను ఉంచడం సమంజసం కాదని కమిషనర్ సూచించారు.

వలంటీర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలోని ఐదవ గ్రామ సచివాలయ పరిధిలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ పోస్టు భర్తీకి మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎస్సీ కేటగిరిలో ముగ్గురు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా ఎంపీడీఓ రాధిక, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూ చేసి జాబితాను ఉన్నతాధికారులకు పంపారు.

వలంటీర్ల నియామకం

సంజామల: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం వలంటీర్ పోస్టుల భర్తీకి అధికారులు ఇంటర్వ్యూ నిర్వహించారు. ఎంపీడీఓ నాగకుమార్ మాట్లడుతూ ఎగ్గొని, ఆర్.లింగందిన్నె, హోత్రమాన్‌దిన్నె గ్రామాలకు సంబంధించి మూడు వలంటీర్ల పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా ముగ్గురు అభ్యర్థులు హాజరయ్యారన్నారు. అర్హత, ప్రతిభ ఆధారంగా వలంటీర్లను నియమించామన్నారు. కార్యక్రమంలో మండల పరిపాలన అధికారి విజయ కుమార్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సురేష్ బాబు పాల్గొన్నారు.

పుట్టపెద్దమ్మకు పూజలు

బేతంచెర్ల: స్థానిక బనగానపల్లె రహదారిలో వెలసిన పుట్ట పెద్దమ్మకు మంగళవారం అధిక శ్రావణ మాసం పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించారు. అలాగే అమ్మవారిశాలలో వాసవీ మాతకు, కొలుములపల్లె రహదారిలోని చౌడేశ్వరీ దేవికి, సిమెంట్ నగర్ సుంకులా పరమేశ్వరీ దేవి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

మంత్రి బుగ్గనను కలిసిన మహిళా పోలీసులు


08డిహెచ్ఎన్65: ఆర్థిక శాఖ మంత్రి బుగ్గనకు వినతి పత్రం అందజేస్తున్న మహిళా పోలీసులు

బేతంచెర్ల: గ్రామ సచివాలయ మహిళా పోలీసులు మంగళవారం రాత్రి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి స్వగృహంలో కలిసి వినతి పత్రం అందజేశారు. వివిధ సమస్యలను మంత్రికి మహిళా పోలీస్ వెల్ఫేర్ స్టేట్ ఎగ్జిక్యూటీవ్ మెంబర్ విజయలక్ష్మి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ గౌసియా విన్నవించారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు శాంతి, లక్ష్మిదేవి, మధు లత, చాయాదేవి, మంజుల పాల్గొన్నారు.

అవుకు యువకుడికి రీసెర్చ్‌లో అవార్డు


ఆవుల అనిల్ కుమార్

అవుకు: పట్టణానికి చెందిన ఆవుల అనిల్ కుమార్ రీసెర్చ్‌లో పబ్లికేషన్ అవార్డును దక్కించుకున్నాడు. మంగళవారం స్థానిక పట్టణంలోని తన స్వగృహం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అవార్డు గ్రహీత అనిల్ కుమార్ మాట్లాడారు. ఆదిమానవులు మనుగడకు మండల కేంద్రం అవుకుతో పాటు కునుకుంట్ల పరిసరాలల్లో సంచరించారన్న విషయాలు సేకరించానన్నారు. అదేవిధంగా వాటికి సంబంధించిన ఆనవాలపై తాను 2014 నుంచి రీసెర్చ్ చేశానని తెలిపారు. ఈ మేరకు జూలై 3వ తేదీన గుజరాత్‌లోని అహ్మదాబాద్ ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ రీసెర్చ్ అండ్ అనాలిటికల్ రివ్యూస్‌కు పంపించానని చెప్పారు. వాటిని వారు పరిశీలించి గతనెల 31వ తేదీన అధికారికంగా పబ్లిష్ చేశారని, పోస్టు ద్వారా తనకు పబ్లికేషన్ అవార్డు పంపించారని వివరించారు.

పట్టణంలో క్షుద్ర పూజల కలకలం

డోన్ టౌన్ : పట్టణంలో మంగళవారం రాత్రి క్షుద్ర పూజల కలకలం చోటు చేసుకుంది. కొండపేట వాటర్ ట్యాంక్ సమీపంలో ఒక ఇంటిలో మంత్రగాడు పుర్రె, ఎముకలు ఉంచి పసుపు, కుంకుమ, నిమ్మకాయలు, దీపంతో క్షుద్ర పూజలు చేస్తుండగా చూసిన మహిళలు పిల్లలు భయభ్రాంతులకు గురై ఇండ్లలోకి పరుగులు తీశారు. దీంతో ఒక్క సారిగా ఆ కాలనీలో అలజడి చేలరేగింది. కొంత మంది యువకులు ఆ ఇంటి వద్దకు వెళ్లి నిలదీయగా మంత్రాలు చేస్తున్న వ్యక్తి (తారకరామనగర్‌వాసి) పారిపోయినట్లు కాలనీ వాసులు తెలిపారు. ఈ నేపథ్యంలో కాలనీ ప్రజలకు పూజలు చేయించుకుంటున్న వ్యక్తుల మధ్య వాగ్వాదం చోటుచేకుంది. పోలీసులకు ఫిర్యాదు చేసుకునే స్థాయి వరకు గొడవ జరిగినట్లు స్థానికులు తెలిపారు.